
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 23 ఆగస్టు 2024


మంచుకొండ క్రాస్ రోడ్డు నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

అన్నదాతలకు అందని మాఫీ 'ఫలం'

ఉమ్మడి జిల్లాలో 1,73,329 మంది రైతులకు రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణ మాఫీ ఫలితం రైతులకు చేరడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికే మూడువిడతల్లో రైతు రుణమాఫీ చేసి బ్యాంకులకు నిధులు విడుదల చేయగా ఆ నిధులతో మళ్లీ రైతులకు కొత్త రుణాలు అందించడంలో మాత్రం బ్యాంకులు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధిక సంఖ్యలో రైతులకు రుణ మాఫీ వర్తించినా మళ్లీ వారికి కొత్త లోన్ ఇవ్వడంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకు మూడు దశల్లో రుణమాఫీ పూర్తి చేయగా ఉమ్మడి జిల్లాలో 1,73,329 మంది రైతులకు రూ.1181.98 కోట్లు రుణమాఫీ వచ్చింది. ఇందులో ఖమ్మం జిల్లాలో 1,15,346మంది రైతులకు 766.61కోట్లు రుణమాఫీ చేశారు. భద్రాద్రి జిల్లాలో 57,983 మంది రైతులకు రూ.415.34కోట్లు రుణమాఫీ చేశారు.


ముదిగొండ బ్యాంకులో రుణాల కోసం రైతులు

ఖమ్మం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఇంకా 8వేలకు పైగా రైతులకు అర్హత ఉన్నా సాంకేతిక కారణమాలో వారికి ఇంకా రుణమాఫీ జరగ లేదు. ఇప్పటివరకు తమకు రుణమాఫీ జరగలేదని ఇరు జిల్లాల్లో 8వేల మందికిపైగా దరఖాస్తు చేశారు. ఏవోలు, ఏఈవోలు ప్రతిరోజు ఫిర్యాదులు స్వీకరించి బాధిత కుటుంబాల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు.

పెట్టుబడి కోసం ఎదురు చూపులు..

ప్రస్తుతం వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమై పొలం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ క్రమంలో రైతులు పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో మళ్లీ రుణం లభిస్తుందన్న ఆశలో ఉన్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. పత్తి పంట పైపాటు ఎరువులు, పురుగుమందులు వినియోగించాల్సి రావడంతో పాటు జిల్లాలో ప్రస్తుతం ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. ముందుగా వేసిన వరినాట్లకు ఎరువులు కూడా అవసరం ఉంది. ఇరు జిల్లాల్లో మిర్చితోటల సాగు కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో రైతులకు ప్రస్తుతం పెట్టుబడి సొమ్ము అత్యవసరంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రుణమాఫీ చేసిందని ఆనందిస్తున్న రైతులు ఆ ఫలితం తమకు ఇంకా దక్కకపోవడంతో కొంత నిరాశ చెందుతున్నారు.

కొత్త రుణాల మంజూరులో తీవ్ర జాప్యం..

ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ నిధులు విడుదల చేసిన బ్యాంకులు మాత్రం ఆ స్థాయిలో మళ్లీ రైతులకు కొత్త రుణాలు ఇవ్వడం లేదు. కొత్త రుణాల విషయంలో బ్యాంకులు, సహకార సంఘాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి రూ.2లక్షల రుణమాఫీ అయిన రైతులకు వెంటనే బ్యాంకులు తిరిగి అప్పు ఇవ్వాల్సి ఉంది. భూముల అర్హత, స్థోమతను బట్టి గతంలో ఉన్న రుణం కంటే అధికంగా తీసుకునే సౌలభ్యం ఉంది. అయితే ఈసారి రుణాలు మంజూరులో బ్యాంకులు నిబంధనలు కఠినతరం చేస్తున్నాయి.

గతంలో ఒకే భూమితో సహకారసంఘంతో పాటు వాణిజ్య బ్యాంకుల్లోనూ రైతులు రుణాలు పొందే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు అలా కాకుండా ఒక భూమికి ఒకేచోట మాత్రమే రుణం తీసుకునేలా ఆధార్‌కార్డు, భూమిపట్టా, సర్వేనెంబర్‌ను అనుసంధానం చేస్తున్నారు. దీంతో బ్యాంకుల్లో రుణాల మంజూరులో కొంత జాప్యం జరుగుతోంది. సహకార సంఘాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా బ్యాంకుల్లో సిబ్బంది కొరత ఉండటం, సొసైటీ రుణ దరఖాస్తుల ప్రతిపాదనలు కో-ఆపరేటివ్ బ్రాంచీల్లో ఆమోదం తీసుకోవడం, దరఖాస్తుల పరిశీలనలో జాప్యం కారణంగా కొత్త రుణాలు ఇచ్చే ప్రక్రియ వేగంగా సాగడం లేదు.

కొత్త రుణాల మంజూరు ఇలా..

వైరా కో-ఆపరేటివ్ సొసైటీలో 2,706మంది రైతులుండగా రూ.2లక్షల లోపు 1,476మందికి రూ.5.16కోట్ల రుణమాఫీ జరిగింది. కానీ ఇప్పటివరకు కేవలం 636మంది రైతులకు మాత్రమే రూ.2.40కోట్ల రుణాలు ఇచ్చారు. ఏన్కూరు మండలం

(మిగతా 7వ పేజీలో)

- కొత్త రుణాల మంజూరులో తీవ్ర జాప్యం
- సగం మందికి కూడా అందని నిధులు
- బ్యాంకుల వద్ద బారులు తీరుతున్న రైతులు
- సిబ్బంది కొరత, కొత్త నిబంధనలతో ప్రక్రియ ఆలస్యం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

రైతుల కోసం ప్రాణాలివ్వటానికైనా సిద్ధం

- రైతు రుణమాఫీని బేషరతుగా అమలు చేయాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం, ఆగస్టు 22: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత దగా చేసిందని రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలబడి ప్రభుత్వంపై కొట్లాడుతుందని, అవసరమైతే ప్రాణాలు ఇవ్వటానికైనా సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా గురువారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వీరూనాయక్ ఆధ్వర్యంలో మంచుకొండ క్రాస్‌రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. రైతు రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతీ రైతుకు అమలు చేయాలని కోరారు. వడ్డీలు చెల్లిస్తేనే రుణాలు మాఫీ చేస్తామని కండిషన్ ఎలా పెడతారని ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల లోపు రుణాలు ఉంటే వడ్డీలను కూడా ఎందుకు మాఫీ చేయకూడదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదన్నారు. మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవికుమార్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య, మాజీ ఖమ్మం ఏఎంసీ ఛైర్మన్ మద్దినేని వెంకటరమణ, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

తెలంగాణా తల్లి విగ్రహం వద్ద నిరసన

ఖమ్మం టౌన్: ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం బైపాస్‌రోడ్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. తొలుత పువ్వాడ తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, అనంతరం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, కార్పొరేటర్లు మోతారపు శ్రావణి, నాగండ్ల కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ నుంచి రైతులకు విముక్తి ఎక్కడ?

- పార్టీ మారి మంత్రులుగా పదవులు అనుభవిస్తున్నారు
- నాడు బీఆర్ఎస్ పథకాలను పొగిడి నేడు విమర్శిస్తున్నారు
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- సత్తుపల్లిలో హోరెత్తిన రైతు ధర్నా

7

భాగవత సప్తాహం కృష్ణభక్తికి సోపానం

భద్రాద్రిలో నేటి నుంచి 30వరకు నిర్వహణ

భద్రాచలం, ఆగస్టు 22: భారతీయ సంస్కృత వాంగ్మయంలో అత్యంత ప్రసిద్ధి పొందిన పురాణాలు 18ఉన్నాయి. వీటిలో పురాణ విమలంగా భక్తి, జ్ఞాన, వైరాగ్య, త్రివేణి సంగమంగా చెప్పబడే గ్రంథం భాగవతం. భగవానుడైన శ్రీకృష్ణమూర్తి సమగ్ర గుణ వైభవాన్ని ప్రకటించిన గ్రంథంగా భాగవతం సుప్రసిద్ధం. అందుకే అనాదిగా భాగవత సప్తాహాలు సర్వత్రా ఆచరిస్తున్నారు. భాగవత సప్తాహ శ్రవణం ద్వారా సమస్త కోరికలు తీరుతాయని పురాణావచనం. అంతటి మహోన్నతమైన భాగవత సప్తాహాలు దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల రామచంద్రుని సన్నిధిలో వైభవంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. గురువారం నుంచి 30వ తేదీ వరకు భద్రాచలంలోని చిత్రకూట మండప ప్రాంగణంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 9వ శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. 23న విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, శ్రీమద్భాగవత మండపాసాధనం, అంకురార్పణం, వాస్తు హోమం, శ్రీకృష్ణ నామస్తోత్ర పారాయణం, శ్రీమద్భాగవత మహత్మ్య ప్రవచనం నిర్వహించనున్నారు. ఈసారి భాగవత సప్తాహంలో అహోబిలం రామానుజ జీయర్‌స్వామి ప్రవచనం నిర్వహించనున్నారు.


జలమయమైన ఖమ్మం పాతబస్టాండ్

పలు ప్రాంతాల్లో వర్షం

అత్యధికంగా వైరాలో 5.4 సెం.మీ. వర్షపాతం నమోదు

ఖమ్మంటౌన్, ఆగస్టు 22: జిల్లాలో గురువారం పలుప్రాంతాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా వైరా మండలంలో 5.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావాప్తంగా 40.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 1.9 సెంటీమీటర్లుగా నమోదైంది. ఖమ్మం అర్బన్ మండలంలో 4.9 సెం.మీ. , కామేపల్లి మండలంలో, నేలకొండపల్లి మండలంలో 3.8 సెం.మీ. వంతున వర్షపాతం నమోదైంది. ముదిగొండ మండలంలో 3.3 సెం.మీ., చింతకాని మండలంలో 3సెం.మీ., రఘునాథపాలెం మండలంలో 2.5, ఖమ్మం రూరల్ మండలంలో 2.3 కొణిజర్ల మండలంలో 2.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఏన్కూరు మినహా మిగతా మండలాల్లో సెంటీమీటర్‌కు పైగా వర్షపాతం నమోదైంది.

7న వినాయక చవితి

16న సామూహిక నిమజ్జనం


మాట్లాడుతున్న వినోద్‌లాహోటి

6

మొబైల్‌లోనే ఎల్‌ఆర్‌ఎస్ స్టేటస్

- పారదర్శకత కోసం సిటిజన్ లాగిన్
- దరఖాస్తుదారుల పరిశీలనకు వెబ్‌సైట్



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 22: అనధికార లే అవుట్లు, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణపై దరఖాస్తుదారులు తమ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్టేటస్‌ను ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంట్లోనే ఉండి సెల్‌ఫోన్‌లోనే చూసుకొనే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై నేరుగా దరఖాస్తుదారులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ దరఖాస్తుల పొజిషన్‌ను పరిశీలన చేసుకొవచ్చు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ను రూపొందించారు. సిటిజన్ లాగిన్ ద్వారా దరఖాస్తుదారులు తమ దరఖాస్తులు ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ప్రక్రియ లేదా ఇతర సాంకేతిక, దస్త్రాలు లేకపోయినా వాటిని పరిశీలించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం దరఖాస్తుదారులు lrs.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా సిటిజన్ లాగిన్‌లో మొబైల్ నెంబర్‌ను నమోదు చేయగానే ఓటీపీ వస్తోంది. ఓటీపీ మొబైల్‌లో నమోదు చేయటం ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తును చేసి చెక్ చేసుకొనే వీలు కల్పించారు.



నూతనంగా జత చేయాల్సిన దస్త్రాలు అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణలో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. వాటిలో కచ్చితంగా కొన్ని డాక్యుమెంట్లు ఉండాలని పేర్కొంది. వాటిలో ముఖ్యమైనవి ప్రతి దరఖాస్తుకు లింక్ డాక్యుమెంట్, లే అవుట్, సైట్ ప్లాన్, మార్కెట్ వాల్యూ ఈసీ, సేల్ డీడ్, దస్త్రాలను జత చేయాలని పేర్కొంది. సిటిజన్ లాగిన్‌లో మొబైల్ ద్వారా డాక్యుమెంట్ జత చేసే వీలు కల్పించారు.

నిబంధనలు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి



- తెల్ల రేషన్‌కార్డు నిబంధనను ఎత్తివేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం టౌన్, ఆగస్టు 22: ప్రభుత్వం నిబంధనలు లేకుండా రుణమాఫీ అమలుచేయాలని, ముఖ్యంగా తెల్లరేషన్ కార్డు నిబంధనను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా సీపీఎం కార్యాలయం సుందరయ్యభవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ రాజకీయరంగు పులుముకుందన్నారు. అధికారపక్షం, ప్రతిపక్షాల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లుగా మారిందని, రైతుకు ఎవరి రాజీనామాలు అక్కరలేదని, రుణమాఫీ చేస్తే చాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ జరిగిందని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఖమ్మంజిల్లాలో కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. జిల్లాలో 3.71లక్షలమంది రైతులు రుణమాఫీకి అర్హులు కాగా 1.15లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. రూ.31వేల కోట్లు రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం తెలిపారని, తరువాత రూ.22వేల కోట్లు రుణమాఫీ చేశామని ప్రకటించి రైతులను మోసం చేశారని విమర్శించారు. గత 15 ఏళ్లుగా రేషన్‌కార్డులు ఇవ్వలేదని, దానిని దృష్టిలో ఉంచుకొని, తెల్లరేషన్‌కార్డు నిబంధన ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలన్నారు. ఈనెల 27న రైతుసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు సీపీఎం మద్దతు తెలుపుతుందన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ పాల్గొన్నారు.

భాషకు బాసటగా

- కోయభాష పునర్జీవానికి కసరత్తు
- చర్యలు చేపడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్



పీవో రాహుల్ కృషి



మాతృభాషకు బాసటగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ కృషి చేస్తున్న తీరు ఆదివాసీలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇటీవల ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో పీవో కోయభాషలో మాట్లాడటం అందరిని ఆశ్చర్య చకితుల్ని చేసింది. ఇందుకోసం ఆయన వారం రోజుల ముందు నుంచే భాషను నేర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పీవో సంస్కృతి, సంప్రదయాల పరిరక్షణ, భాషాభివృద్ధితోనే సాధ్యమని పేర్కొనడంతో కోయవాచక బోదనకు మార్గం సుగమం అవుతోంది.

భద్రాచలం, ఆగస్టు 22: భద్రాద్రి ఏజెన్సీలో విద్యారంగాన్ని పటిష్ఠం చేసేందుకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి ఏజెన్సీలోని గిరి బాలబాలికలకు ప్రాథమికస్థాయిలో చదువుల పట్ల ఆసక్తి కలిగించేందుకు మాతృభాష బోధనే ఎంతో ప్రాధాన్యమని భావిస్తున్నారు. గత కొంతకాలంగా కోయభాష బోధనకు అవసరమైన చర్యలు ఆశించిన స్థాయిలో లేవనే విమర్శలు లేకపోలేదు. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరంలో ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీసీఆర్ అండ్‌టీఐ) ఆధ్వర్యంలో ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు వారి మాతృభాషలో బోధనకు పుస్తకాలు అందజేసేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం ఇప్పటికే ఆ పుస్తకాల ముద్రణకు టీసీఆర్‌అండ్‌టీఐ చర్యలు చేపట్టగా త్వరలో అవి భద్రాచలం ఐటీడీఏకు రానున్నట్లు తెలుస్తోంది.

త్వరలో మూడో తరగతి కోయవాచకానికి వర్కుషాపు

మూడో తరగతి కోయవాచకం తయారీ కోసం రచయితల ఎంపిక కసరత్తు చేపడుతున్నారు.రాష్ట్రంలో ప్రధనంగా కోయ, గోండి, బంజార, కొలామి భాషలుండటంతో వారికి మాతృభాషలో బోధనపై దృష్టిసారించే ప్రక్రియలో భాగంగా టీసీఆర్‌అండ్‌టీఐ సహకారంతో ఐటీడీఏ అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్కుషాపు నిర్వహించే క్రమంలో ముందుగా సంబంధిత భాష ప్రావీణ్యత సాధించిన ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి వారితో వర్కుషాపు పూర్తయిన అనంతరం ఒక ఇన్‌చార్జిని జిల్లాకు నియమించనున్నారు.

గతంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 130 పాఠశాలల్లో కోయభాష, 40 పాఠశాలల్లో బంజార భాషల్లో బోధన సాగింది. అయితే భద్రాద్రి ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కోయవాచకం విద్యార్థులకు అందించడం వల్ల కోయభాషలో మాట్లాడే వారి సంఖ్య పెరిగేందుకు వీలుంటుందనే భావన ఆదివాసీల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే వాజేడు, వెంకటాపురం తదితర మండలాల్లో భాషలో మాట్లాడేవారి సంఖ్య నామమాత్రంగా ఉన్న క్రమంలో సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఎంతో కీలకమైన భాషను పరిరక్షించుకోవాలంటే అందరికీ బోధన ఎంతో కీలకమని వారు పేర్కొంటున్నారు. టీసీఆర్‌అండ్‌టీఐతో పాటు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(సీఐఐఎల్), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనీ (ఎన్‌సీఈఆర్‌టీ)లు కూడా ఇందుకోసం కృషి చేస్తున్నాయి.

గతంలో కోయ భారతితో

2004-05లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భద్రాచలం పర్యటనకు వచ్చిన సమయంలో కోయభారతిని కూనవరం మండలం నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో ఆవిష్కరించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆనాడు ప్రయోగాత్మకంగా పది పాఠశాలలు ఆరంభించగా అనంతరం 2005-06లో 50పాఠశాలలకు విస్తరింపజేశారు. 2006-07లో రెండో తరగతికి కోయభారతి పుస్తకాలను రూపొందించి అనంతరం ఐదో తరగతి వరకు వాటిని విస్తరింపజేశారు. కాగా గిరిజన సంక్షేమ శాఖ సర్వశిక్షాభియాన్‌లు సంయుక్తంగా 2011-12 వరకు 250పాఠశాలల్లో కోయభారతిని అమలుచేశారు. అనంతరం ప్రత్యేక కారణాల నేపథ్యంలో కోయభారతిపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో ఆ అంశం మరుగున పడింది. పదివేల పదాలతో తీర్చిదిద్దిన కోయ నిఘంటువు సైతం వెలుగులోకి తేవాలని చేసిన ప్రయత్నం అర్ధాంతరంగా ఆగిపోయింది. ఇదిలా ఉండగా 2019లో అంతర్జాతీయ ఆదిమ జాతుల బాషా సంవత్సరంగా ప్రకటించడంతో ఆనాడు రాష్ట్రంలోని వివిధ ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆదిమ తెగల భాషల పరిరక్షణ కోసం సంబంధిత అధికారులు భద్రాచలం ఐటీడీఏ పరిధిలో కోయ, బంజార భాషా పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రభుత్వ పాఠశాలల్లో కోయ, బంజార భాషాలను ప్రాథమికస్థాయిలో ఆనాడు ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాలో కోయ భాష 181పాఠశాలల్లో, బంజారభాష 40 పాఠశాలల్లో అమలు చేశారు.

2019లో గిరిజన బాల గేయాల సీడీ రూపకల్పన

గిరిజన మాతృభాషలో విద్యాబోధన కోసం 2019లో అప్పటి ఐటీడీఏ పీవో పమేలా సత్పతి గిరిజన బాలగేయాల సీడీ రూపకల్పన చేశారు. గిరిజన గాయకులతో కోయవాచకంలోని గేయాలను పాడించి సీడీలు రూపొందించారు. ఏజెన్సీలోని గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో వీటిని పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయిలోనే ఆనాడు భద్రాద్రి ఐటీడీఏలో సరికొత్త ప్రయోగం చేసింది



కేఎంసీలో ప్రక్షాళన షురూ..

- తిష్ఠ వేసిన ఉద్యోగులకు సెక్షన్ల మార్పు
- పారిశుధ్య విభాగంలోను మార్పులు..

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 22: ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగుల ప్రక్షాళనకు గురువారం తొలి అడుగు పడినట్లు చర్చ జరుగుతోంది. ఈ మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్, అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందంచారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత కోసం కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు ప్రతి మూడేళ్లకు ఒకసారి సెక్షన్లను మార్పులు చేస్తుంటారు. ఈ విధానం ద్వారా ఉద్యోగులకు అన్ని విభాగాలపై అవగాహన, వృత్తి నైపుణ్యం పెరుగుతోంది. అయితే కేఎంసీలో మాత్రం పదేళ్లుగా ఉద్యోగులు ఒకే సెక్షన్‌లో తిష్ఠ వేశారు. కమిషనర్లు మారినా కూడా ఆయా సెక్షన్లు ఉద్యోగులు మాత్రం తమ కుర్చీల స్థానాలు మార్చు కోలేదు. కొంతకాలంగా కేఎంసీలో ఉద్యోగుల పనితీరుపై అనేక విమర్శలు రావటంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రక్షాళన దిశగా తొలి అడుగు వేశారు. ఒకే విభాగంలో ఏళ్లతరబడి పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని మరో సెక్షన్‌కు మార్చేందుకు కసరత్తు పూర్తి చేశారు. పారిశుధ్య విభాగంలోను క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది పనితీరుపై రోజు వారీగా సమీక్షలకు నిర్ణయించారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు అర్హతలను పరిశీలన ప్రారంభించారు. ఏ ఉద్యోగి ఎక్కడ పనిచేసేది, ఎన్ని రోజులు విధులకు హాజరైనారనే విషయాలను సంబంధిత విభాగాల అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలను ఇక ప్రతి నెల తీసుకోని వేతనాలు చేయాలని నిర్ణయించాని సమాచారం. ఏళ్ల తరబడి ఒకే డివిజన్‌లో ఉంటూ పనితీరుపై విమర్శలు వచ్చిన పారిశుధ్య సిబ్బందిని ఇతర డివిజన్లకు మార్చేందుకే చర్యలను ప్రారంభించారని తెలిసింది.

ఎల్ఆర్ఎస్ ఫిర్యాదులపై..

బాధ్యతగా బదులివ్వాలి

- కేఎంసీలో హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన మేయర్



హెల్ప్ డెస్క్‌లో మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 22: అనధికార లే అవుట్ల, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్ ఆర్ఎస్)పై ప్రజలు ఎటువంటి ఫిర్యాదులు, అనుమానాలు వ్యక్తం చేసినా వాటిని జవాబుదారి తనంతో నివృత్తి చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునకొల్లు నీరజ సూచించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎల్ ఆర్ఎస్ ఫిర్యాదులు స్వీకరణకు గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్య హెల్ప్ డేస్క్‌ను ఏర్పాటు చేశారు. హెల్ప్ డేస్క్‌ను మేయర్ పునకొల్లు నీరజ పరిశీలించారు. ఎంత మంది సిబ్బందికి విధులు కేటాయించారు. ఎన్ని గంటల పాటు హెల్ప్ డేస్క్ నిర్వహిస్తున్నారు. అనే విషయాలను సిబ్బందిని ప్రశ్నించి తెలుసుకున్నారు. ల్యాప్‌టాప్‌లను హెల్ప్ డేస్క్‌లు ఏర్పాటు చేసుకొని ఎల్ఆర్ఎస్ ఫిర్యాదులపై సాంకేతికంగా ప్రజలకు వారి దరఖాస్తులపై వివరించాలని సూచించారు.

మందుల్లేవ్..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ

- చర్ల సీహెచ్‌సీలో ఇంజెక్షన్ల కొరత
- కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ అదే దుస్థితి
- ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న రోగులు
- నగదు లేక వెళ్ళిపోతున్న మరి కొంత మంది
- పట్టించు కోని వైద్య శాఖ అధికారులు
- 20 రోజులుగా ఇదే దుస్థితి



చర్ల వైద్యశాల్లో చికిత్స పొందుతున్న రోగులు

చర్ల, అగస్టు 22: చర్ల సీహెచ్‌సీ, కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగులు క్యూ కడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలడంతో పరుగులు తీస్తున్నారు. రెండు వైద్యశాల్లో మాత్రం పలు రకాల ఇంజెక్షన్లు నిండుకున్నాయి. సుమారు 20 రోజులుగా రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ మందుల దుఖానాల్లో కొనుగోలు చేస్తున్నారు. డబ్బులు లేని వారు వైద్యశాలపై తిట్ల దండకం ఎత్తుతున్నారు. వైద్యశాల్లో మందుల కొరత ఉన్నా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోక పోతే ప్రభుత్వ వైద్యంపైన నమ్మకం పోయే దుస్థితి నెల కొంది. ఇదిలా ఉండగా కొయ్యూరు వైద్యశాల్లో ప్లేట్ లెట్స్ కౌంట్ చేసే యంత్రం మరమ్మతులు గురైంది. రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదు.

20 రోజులుగా సూదిమందు లేదు..

ప్రతీ రోజు ప్రతీ వైద్యశాల్లో 130 నుంచి 250 ఓపీ ఉంటుంది. ఇక్కడకు వచ్చే వారు నిరుపేదలే, ప్రతీ రోజు 200 వందల కోసం పని చేసే వారే. కాగా వ్యాధులు ప్రబల డంతో వైద్యశాలలకు రోగులు వస్తున్నారు. వైద్యశాల్లో ఉండాల్సిన ప్యాంటాప్రజోల్, డైక్లోఫినాక్, జోఫర్ ఇంజెక్షన్లు, ప్యారాసెట్‌మాల్ సూదిమందులు లేవు. ఇవన్నీ గ్యాస్ట్రబుల్, వాంతులు, జ్వరాలకు ఉపయోగ పడే ఇంజెక్షన్లు. కాగా వైద్య శాలల్లో ఇవి లేక పోవడంతో వైద్యులు బయటకు మందులు రాస్తున్నారు. కొంత మంది వాటిని కొనుగోలు చేస్తుండగా, మరి కొంత మంది డబ్బులు లేక వెళ్లిపోతున్నారు. కొయ్యూరు వైద్యశాల్లో అక్కడ ఉన్న సిబ్బంది సొంత ఖర్చులతో భయటనుంచి తెచ్చి రోగులకు ఇంజెక్షన్లు వేస్తున్నామని చెబుతున్నారు.



కొయ్యూరు వైద్యశాల

అలంకారప్రాయంగా ప్లేట్ లెట్స్ కౌంటింగ్ మిషన్

కొయ్యూరు వైద్యశాలకు ప్రభుత్వం ప్లేట్ లెట్స్ కౌంటింగ్ మిషన్ (సీబీపీ, కంప్లీట్ బ్లెడ్ పిచ్చర్) అందజేసింది. గత కొద్ది రోజులుగా వైద్య సిబ్బంది మిషన్ వినియోగించారు. గత 10 రోజుల క్రితం మిషన్ చెడిపోయింది. కానీ ఇప్పటి వరకు అధికారులు దాన్ని మరమ్మతులు చేపించలేదు. జిల్లా అధికారులు కూడా పట్టించు కోవడం లేదు. ఇంజెక్షన్ల కొరతపై డీసీహెచ్ రవిబాబుని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పైనుంచి సరఫరా లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని తెలిపారు.



పనిచేయని ప్లేట్‌లెట్స్ కౌంటింగ్ మిషన్

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- పాఠశాలల శిథిల భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలను అందించండి
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్



మాచినేనిపేటతండాలో పర్యటించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్

జూలూరుపాడు, ఆగస్టు 22: పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థలో ఉన్న వాటిని గుర్తించి వాటి మరమ్మతులకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలను అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని చింతలతండా, బేతాళపాడు, మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం పంచాయతీలలో పర్యటించారు. చింతలతండాలో నాటుదాం ఒక చెట్టు - అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా దేవ రైతు పొలంలో కలెక్టర్ మునగ మొక్కలను నాటారు. బేతాళపాడు పంచాయతీ కార్యలయాన్ని సందర్శించి ఔషధ మొక్కల ప్లాంట్‌ను, అజొల్లా గడ్డి పెంపకాన్ని పరిశీలించారు. ప్రతి పంచాయతీ కార్యాలయంలో ఔషధ మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. ఇంకుడు గుంతలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న రేగళ్ల తండాలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతినడంతో కొత్త భవనాన్ని నిర్మించడానికి స్థలం సరిపడా లేకపోవడంతో పాఠశాల సమీపంలో గ్రామానికి చెందిన వ్యక్తి స్థలం ఉండటంతో దానిని కొనుగోలు చేసి నూతన భవనాన్ని నిర్మిద్దామని సంబంధిత వ్యక్తితో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. మాచినేనిపేట తండా పంచాయతీ పరిధిలో రహదారి పక్కన నిర్మించిన ఇంకుడు గుంతను, చిన్నతండా ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. వర్షపు నీరు కురవకుండా మరమ్మతులు చేపట్టవచ్చని ప్రతిపాదనలను తయారు చేసి అందించాలని సూచించారు. కొమ్ముగూడెంలోని శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు అన్ని శాఖల అధికారులు సమయపాలన పాటిస్తూ గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రైతులు అజొల్లా గడ్డి పెంపకం చేపట్టేలా అవగాహన కల్పించాలని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ విద్యాచందన, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో తులసీరాం, ఏపీవో రవి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు వెళుతున్నమాస్‌లైన్ నాయకులు

ఆరు గ్యారెంటీలను తక్షణం

అమలుచేయాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, రఘునాథపాలెం, ఆగస్టు 22: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఖమ్మం జిల్లా నుంచి భారీగా నాయకులు చలో హైదరాబాద్‌కు వెళ్లారు. 9నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీలను అమలు చేయటం లేదని పార్టీ నాయకులు విమర్శలు చేశారు. ఛలో హైదరాబాద్ వెళ్లిన వారిలో జిల్లా నాయకులు ఆవుల మంగతాయి, కేలోత్ లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, జాటోత్ ప్రేమ్‌సింగ్, మధార్‌సాహెబ్, లింగనబోయిన నాగేశ్వరరావు, పుప్పాల రామారావు, కుప్పల రామారావు, వెంకటరామయ్య, గుగులోత్ లచ్చు, ఆడేపు సత్యం, ఇస్లావత్ రమేశ్, బానోత్ రాము, ధరావత్ రవి, వనం రామారావు, తదితరులు ఉన్నారు.

ఒక్క చెట్టు.. అమ్మ పేరుమీద..

- రాష్ట్రంలోనే తొలిసారిగా సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రారంభం
- అందరూ బాధ్యతగా మొక్కలు నాటాలి
- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, ఆగస్టు 22: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు బస్టాండ్‌లో ప్రభుత్వం చేపట్టిన 'ఒక్క చెట్టు-అమ్మపేరు మీద' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రాగమయి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు మొక్కలను పెంచడాన్ని బాధ్యతగా చేపట్టాలని కోరారు. వివాహ, జన్మదిన, శుభకార్యాలయాలలో ఆదర్శంగా ఉండేలా ఒక మొక్కను నాటాలని యువతకు ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే ప్రథమంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఒక్క 'చెట్టు అమ్మపేరుమీద ' చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ ఛైర్మన్ బాదం నీరజాదేవి, ఎంపీడీఓ చంద్రశేఖర్, సీడీపీఓ నిర్మల జ్యోతి, ఎంపీఓ సురేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకర్ చౌదరి, భూక్య శివకుమార్ నాయక్, సత్యనారాయణ చెడ్డి, తురాబలి ఎస్‌కె , ఏనుగు సత్యంబాబు, ఆలకుంట నరసింహారావు, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాగమయి

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో... మండలంలోని ముక్కు వెంకటాపురంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్య క్రమంలో ఎమ్మెల్యే రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవత మూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీరజాదేవి, ఆలయ కమిటీ నిర్వాహకులు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మిర్చి సాగుకు సై..

ఎర్రబంగారం సాగుపై రైతుల్లో ఏమాత్రం తగ్గని మక్కువ

వైరా, ఆగస్టు 22: గత ఏడాది తీవ్ర నష్టాలను చవిచూసినప్పటికీ రైతులకు ఎర్రబంగారమైన మిర్చి సాగుపై మక్కువ తగ్గటం లేదు. ఈ ఏడాది పలు గ్రామాల్లోని రైతులు ఇప్పుడిప్పుడే మిర్చి సాగు చేపట్టారు. గత ఏడాది మిర్చి మొదటికోత దిగుబడి వచ్చిన సమయంలో క్వింటా ఒక్కింటికి రూ.22వేలకుపైగా ధర పలికింది. అప్పటికే ఎకరాకు మిర్చి సాగు నిమిత్తం లక్షలరూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు మొదటి కోత దశలోనే రూ.22వేలకుపైగా ధర పలకడంతో ఇంకా ఆరేటు పెరుగుతుందనే ఆశతో విక్రయించకుండా కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేశారు. అధిక రేటుకు విక్రయించి పెట్టుబడులు, అప్పులు పోగా కొంత మొత్తం తమకు ఆదాయం వస్తుందని తద్వారా కుటుంబ జీవన పరిస్థితి మెరుగుపడుతుందని రైతులు ఆశించగా వాస్తవ పరిస్థితుల్లో రైతులకు భంగపాటే ఎదురైంది. మిర్చి రేటు పెరగకపోగా క్రమేపి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం మిర్చి ధర క్వింటా ఒక్కింటికి రూ.19500మాత్రమే ఉంది. పదినెలల కిందట రూ.22వేల ధర ఉండగా ఇప్పుడు ఆరేటు రెండున్నర వేలకుపైగా తక్కువ పలుకుతుంది. కోల్డ్‌స్టోరేజీల్లోనే రైతుల మిర్చి మూలుగుతుంది. అద్దెల రూపేణా వేలాదిరూపాయలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. అయినప్పటికీ ఆశ చావని రైతులు మళ్లీ మిర్చి సాగుపై దృష్టిసారించారు.

గతంలో నర్సరీల్లో ఒక్కో మిర్చి మొక్కను రూపాయి చొప్పున కొనుగోలు చేసేవారు. అయితే ఈ ఏడాది రైతులే నేరుగా మిర్చి విత్తనాలు కొనుగోలు చేసి నర్సరీల్లో పెంపకం చేపట్టారు. అంటే విత్తనాలు రైతులవి, మిర్చినారు పెంపకం నర్సరీల నిర్వాహకులకు అప్పగించారు. ఎకరాకు కనీసం 12వేల మిర్చిమొక్కలు అవసరమవుతాయి. ఈ నారుకు సంబంధించి 20ట్రేలలో మిర్చినారు పెంచాల్సి ఉంది. ఒక్కో ట్రేలో 98మిర్చిమొక్కలను పెంచుతారు. ఒక్క ట్రేలో మిర్చిమొక్కలు పెంచినందుకుగానూ నర్సరీ నిర్వాహకులకు రూ.60చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఈవిధంగా ఒక ఎకరంలో మిర్చి సాగుకు 200ట్రేలలోని పెంచిన మిర్చి మొక్కలు అవసరమవుతాయి. వీటి ఖర్చు రూ.12వేల వరకు రైతులు భరించాల్సి ఉంది.

దుక్కులు, మిర్చి విత్తనాలు ఇతరత్రా అన్ని ఖర్చులు కలిపి ఒక ఎకరంలో మిర్చి సాగుకు రూ.30నుంచి రూ.35వేల ఖర్చవుతుంది. ఇక ఆతర్వాత మిర్చి యాజమాన్య పద్దతులకు, రైతులు పెట్టే పెట్టుబడులకు అంతే ఉండదు. ఎర్రనల్లి, ఇతర తెగుళ్ల నుంచి మిర్చిని కాపాడుకొనేందుకు రైతులు లక్షలరూపాయలు కుమ్మరించి పురుగుమందులు పిచికారి చేయాల్సిన పరిస్థితులున్నాయి. ప్రస్తుతం వైరా మండలంలో రెబ్బవరం, జింకలగూడెం, తాటిపూడి, గొల్లపూడి, అష్ణగుర్తి, గొల్లెనపాడు, వల్లాపురం, గరికపాడు లింగన్నపాలెం, విప్పలమడక, సిరిపురం, పుణ్యపురం, సోమవరం, నారపనేనిపల్లి తదితర గ్రామాల్లో రైతులు మిర్చి సాగుచేస్తున్నారు. పదిరోజుల నుంచి తీవ్ర ఎండలు, వర్షాభావంతో రైతులు జనరేటర్లు ఇతరత్రా మోటార్లు ఏర్పాటుచేసుకొని మిర్చిమొక్కలు నాటారు. సోమవారం భారీ వర్షం కురవడంతో మంగళవారం జనరేటర్లు, మోటార్ల అవసరం లేకుండా పదునైనా నేలల్లో మిర్చి సాగును ముమ్మరంగా చేపట్టారు.



రెబ్బవరంలో మిర్చిమొక్కలు నాటుతున్న కూలీలు

'మరుగు' ఎలా ?

- అస్తవ్యస్తంగా టాయిలెట్ల నిర్వహణ



కలెక్టరేట్‌లో మరగుదొడ్ల దుస్థితి ఇలా..

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 22: అది కలెక్టర్ కార్యాలయం.. అంతే కాదు.. 30శాఖల అధికారులు కార్యాలయాలు ఉన్న సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం... నిత్యం ఇక్కడికి కనీసం 2వేల మంది సందర్శకులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేక అవస్థలు పడాల్సి వస్తోంది. పాత డీపీఆర్వో కార్యాలయం సమీపంలో ఉన్న మరుగుదొడ్లలో కొన్నిటికి తలుపులు తీస్తే రావు.. వస్తే పడవు.. అంతే కాదు ఫ్లష్ ట్యాంకులు పనిచేయడం లేదు. నీళ్లు పోయడం మాటెరుగు కానీ వాటిని చూస్తే మాత్రం జుగుప్స కలుగుతోంది. ఏడాది క్రితం నిర్మించిన వాటికే నిర్వహణ లేక దిక్కులేకుండా పోతోందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని సందర్శకులు కోరుతున్నారు.



ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనాలు



ప్రమాదం జరిగే డివైడర్ ప్రదేశం

యమపురికి దారి..

- రోజూ ఏదో ఒక ప్రమాదం

ఖమ్మంక్రైం,ఆగస్టు17: నగర శివారులోని ఆ రహదారి వద్ద డివైడర్ తొలిగించడంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. అక్కడివరకు వేగంగా వచ్చిన వాహనాలు వేగం అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. నగర శివారులోని కలెక్టరేట్ కార్యాలయానికి సమీపంలోనే ఈఘటనలు జరగుతున్నాయి. రెండు రాష్ట్రాలకు మధ్య లో ఉన్న వైరా రోడ్డులో హైదరాబాద్, వరంగల్ నుంచి వచ్చే వాహనాలతో ఆరోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది.

ఖమ్మం కలెక్టరెట్ కు వచ్చే వాహనాలు కూడా ఎక్కువగా వస్తుంటాయి. భద్రాచలం, కొత్తగూడెంకు లారీలు ఎక్కువగా వెళుతుంటాయి. దీంతో వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉంటుండంతో, పెద్దరోడ్డు కావడంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయి. ఈనేపథ్యంలో అక్కడ రోడ్డు దాటేందుకు వచ్చే వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత 2023 జనవరిలో బీఆరెస్ పార్టీ నలుగురు ముఖ్యమంత్రులతో కలిసి కలెక్టరేట్ సమీపంలో ప్రజాఆశీర్వాద సభ నిర్వహించారు.

ఈనేపథ్యంలో సభకు వెళ్లే వాహనాలకోసం అక్కడ డివైడర్‌ను కొంతమేర తొలిగించారచు. అప్పటినుండి అధికారులు దానిని అలానే వదిలేశారు. దీంతో అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం సభ జరిగిన వైపు నుండి ఓ మినీవ్యాన్ వస్తుండగా కలెక్టరేట్ వైపు నుండి ఓకారు వస్తుంది. సరిగా డివైడర్ వద్దకు రాగానే రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదం జరిగిన రెండుగంటల తర్వాత డివైడర్ దాటుతు ఓ ద్విచక్రవాహనదారుడికి ప్రమాదం జరిగింది.

ఇది ఏడాదికిపైగా అలాగే ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సమీపంలో వైరారోడ్డు లో నిత్యం వాహనాలు రద్దీగా ఉంటాయి. దీంతో వేగంగా వస్తున్న వాహనాలకు డివైడర్ దగ్గరకు వస్తేనే అక్కడ డివైడర్ లేనట్లు తెలుస్తుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి డివైడర్‌ను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.అక్కడ యూటర్న్ ఉండటం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు అంటున్నారు.

7న వినాయక చవితి.. 16న నిమజ్జనం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 22: భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకుందామని స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి అన్నారు. గురువారం ఖమ్మం మామిళ్లగుడెం సమితి కార్యాలయంలో ఉత్సవ కమిటీ కార్యనిర్వహణ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ గెంటేల విద్యాసాగర్, కార్యదర్శి కీసర జయపాల్‌రెడ్డిలు వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 7న జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు మొదలవుతాయని, 16న సామూహిక గణేష్ నిమజ్జనం నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వీలైనంత వరకు మట్టి విగ్రహలనే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. త్వరలోనే గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేస్తామని తెలిపారు.

స్తంభాద్రి ఉత్సవ సమితి గత నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వానికి గణేష్ మండప నిర్వాహకులకు మధ్య వారధిగా పనిచేస్తుందని అన్నారు. గణేష్ మండప నిర్వాహకులకు సహకారంగా పని చేస్తూ ఖమ్మం నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, మూలగుండ్ల శ్రీహరి, డౌలె సాయి కిరణ్, సుధాకర్, కేశవ్ పటేల్, ఈశ్వర ప్రగడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కనిపించని ధరల సూచికలు...

- బిల్లులు ఇవ్వని వ్యాపారులు.. నష్ట పోతున్నరైతులు
- ఇదీ విత్తన, పురుగుల మందుల వ్యాపారుల తీరు

చర్ల, అగస్టు 22: చర్ల మండలంలో విత్తన, పురుగుల మందుల వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గిరిజన రైతులను టార్గెట్ చేసుకుని నిలువునా మోసం చేస్తున్నారు. రైతులు ఏ వస్తువు కొన్నా రసీదులు ఇవ్వాల్సి ఉండగా కొంత మంది ఇవ్వడం లేదనే ఆరోపలు వినిపిస్తున్నాయి. కనీసం దుకాణం ముందు వస్తువుల వివరాలు, ధర పట్టికలు ఏమాత్రం పెట్టడం లేదు. వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరించినా వారి మాటలు ఏమ్రాతం లెక్క చెయ్యడం లేదు.

కొద్ది రోజుల క్రితం ధరల పట్టికలపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన క్రమంలో చర్ల వ్యవశాయశాఖ అధికారి శివరాం ప్రసాద్ తనఖీలు చేసి ధరల బోర్డులు పెట్టించారు. 20 రోజుల తిరగక ముందే వ్యాపారులు వాటిని లొలగించారు. ఇప్పటికై జిల్లా వ్యవసాయశాఖ అధికారి చర్ల మండలంపై దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తన, పురుగుల మందు దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. ఇదే అవకాశంగా తీసుకుంటున్నా కొంత మంది వ్యాపారులు అధిక ధరలకు మందులు, విత్తనాలు, ఇతర వస్తువులు అమ్ముతున్నారు. దుకాణాల ముందు వస్తువుల వివరాలు, ధరలు, నిల్వలు ఎప్పటికి అప్పుడు పెట్టాల్సి ఉంటుంది. రైతులు వాటిని చూసి ధరలు తెల్సుకునే అవకాశం ఉంటుంది. కానీ మండలంలో ఇవన్నీ కనిపించడం లేదు. మండలంలోని గొంపల్లి, ఆర్‌కొత్తగూడెం, ఇతర దుకాణల్లో ఇదే పరిస్థితి ఉంది. మరి కొన్ని దుకాణాల్లో రికార్డులు కూడా మెయిన్‌టెన్స్ చెయ్యడం లేదని పలువురు చెబుతున్నారు. వ్యవశాయ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న తీరుకూడా ఇందుకు అవకాశంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి.

వ్యవశాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో వ్యాపారులు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. ధరల పట్టికలు, వివరాలు దుకాణం ముందు లేక పోవడంతో వ్యాపారి చెప్పిన ధరలను రైతులు కొనాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

నూతన ఆర్వోఆర్ చట్టంపై
సలహాలు, సూచనలు అందించాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 22: భూసమస్యల పరిష్కారానికి ప్రవేశపెడుతున్న నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు అదించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, నిపుణులతో నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూరికార్డుల నిర్వహణను పరిశీలించిన నిపుణుల బృందం నూతన చట్టం ముసాయిదా బిల్లును రూపొందించిందని తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వర్కుషాపు నిర్వహించినట్టు తెలిపారు. రైతుసంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతనిధులు తమ సూచనలు అందించాలని కోరారు. సలహాలు, సూచనలు ఉంటే వెంటనే రాతపూర్వకంగా కలెక్టర్ కార్యాలయానికి అందిస్తే వాటిని ఒక నివేదిక రూపంలో తయారుచేసి సీసీఎల్‌కు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరిఆర్డీవోలు జి.గణేష్, ఎల్.రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, అదికారులు, న్యాయవాదులు, రైతుసంఘాల నాయుకలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో డీఎంహెచ్‌వో విచారణ


విచారణ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 22: భద్రాచలంలోని జీవన్ ఆసుపత్రిలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు విచారణ నిర్వహించారు. ఇటీవల వైద్యశాలలో ఓ గిరిజన యువతికి గర్భస్రావం అవడం, ఇదే సమయంలో మృతశిశువు గోదావరి వారధి కింద లభ్యం కావడం చర్చనీయాంశమైంది. దీనిపై పత్రికల్లో వార్తా కథనాలు సైతం వెలువడ్డాయి. ఈ సంఘటనపై కలెక్టరు ఆదేశాలతో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో వైద్యాధికారుల బృందం వైద్యశాలలో విచారణ నిర్వహించారు. వైద్యశాలకు సంబంధించిన రికార్డులు, నివేదికలను సేకరించారు. అలాగే వైద్యురాలి నుంచి రాతపూర్వక వివరణ తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నివేదికను కలెక్టరుకు అందజేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ విచారణలో జిల్లా ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వైద్యులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీనాయక్, ఎండీ ఫైయాజ్ మొహియుద్దీన్, పాయం శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే లక్ష్యం సులువే..

» జేసీ మధుసూదన్ నాయక్

బోనకల్, ఆగస్టు 22: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చునని జేసీ మధుసూదన్ నాయక్ తెలిపారు. బోనకల్‌లోని కస్తూర్బా పాఠశాలతోపాటు ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలల నిర్వహణ, సౌకర్యాల కల్పన తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. చదువుల్లో రాణించడానికి చేయాల్సిన విధానాల గురించి దిశా నిర్దేశం చేశారు. తల్లిదండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. పెద్దల పట్ల వ్యవహరించే తీరు వారి ఎదుగుదలకు సహకరిస్తుందన్నారు. చదువుతోపాటు సమాజం పట్ల అవగాహన పెంచుకొని, నైతిక విలువలతో ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాలయాల్లో సమస్యలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట ఆర్ఐ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

భద్రాద్రిని మరువం...
అభివృద్ధి చేసి చూపిస్తాం

» అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెంకు ఘన స్వాగతం

» ఆత్మీయ పౌర సన్మానంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు


ప్రసంగిస్తున్న పొదెం వీరయ్య

భద్రాచలం, ఆగస్టు 22: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలాన్ని తాము ఎన్నటికీ మరువమని అభివృద్ధి చేసి చూపిస్తామని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. భద్రాచలంలో గురువారం అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యకు ఆత్మీయ పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి భద్రాచలం వచ్చిన వీరయ్యకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఇదే సమయంలో మహిళలు మంగళహారతులు ఇచ్చారు. గోదావరి వారధి నుంచి పౌర సన్మానం జరిగే సభా వేదిక వరకు భారీ ర్యాలీ సాగింది. ఈ క్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యాలు, బాణసంచా పేల్చివేతతో కోలాహలంగా సాగింది. అనంతరం సభా వేదికపై పొదెం వీరయ్యను ఘనంగా సన్మానించారు. భద్రాద్రి ఏజెన్సీలోని గిరిజనులకు ఇళ్లను కేటాయించడంలో ప్రాధాన్యత కల్పించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టారని ఆయన గుర్తు చేశారు. విద్యుత్తు, రెవెన్యూ, అటవీహక్కుల సమస్యలతో బాధపడుతున్నాం. ఈ సమస్యలన్నింటిని అధికమించేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భద్రాచలం-వాజేడు రోడ్డు అధ్వానంగా ఉందని దానిని పరిష్కరించేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు కృషి చేస్తారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ తాము ఇరువురం సమన్వయంతో పని చేసి భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వైరా శాసన సభ్యులు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ భద్రాచలం ప్రాంత ప్రజలు ఎంతో అదృష్టవంతులని ఇందిర, రాజీవ్, సోనియాగాంధీలు ఈ ప్రాంతంలో పర్యటించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంధ సంస్థల నాయకులు, గిరిజన, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మధిరటౌన్,ఆగస్టు22: మధిర మునిసిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, దీనిని తక్షణమే మెరుగు పరచాలని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం మధిర మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మొండితోక లత అధ్యతన జరిగిన మునిసిపాలిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యంపై కౌన్సిలర్లతో పాటు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని దీన్ని సరిచేసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. వర్షాల వల్ల మురుగునీరు నిలిచి దోమలు, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఇప్పటికే ఎక్కడ చూసినా జ్వరపీడుతులు ఉన్నారని ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారీ చేయించాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా డంపింగ్ యార్డును పట్టణం నుంచి తరలించాలని డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వరకు తక్షణమే రోడ్డు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్ సన్యాసయ్య, వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, కమిషనర్ షఫీఉల్లా, టీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

బీఆర్ఎస్ రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోనకల్, ఆగస్టు 22: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్, జడ్పీటీసీలు బంధం శ్రీనివాసరావు, బాణోతు కొండ మాట్లాడుతూ నిబంధనల పేరుతో సగం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలిచ్చి రైతులను మభ్యపెట్టిందని, తమ పార్టీ ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటాలను చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొనకంచి నాగరాజు, కొమ్మినేని ఉపేందర్, పారా ప్రసాద్, యంగల కనకయ్య, కాకాని శ్రీను, రెడ్డిబోయిన ఉద్దండు, రమేష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలను పకడ్బందీగా నిర్వహించాలి

బోనకల్, ఆగస్టు 22: ఓటర్ల జాబితా సవరణలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ పున్నం చందర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితా సవరణలపై బీఎల్‌వోలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి అక్టోబరు 18 వరకు గ్రామాల్లో ఓటర్లకు సంబంధించి ఇంటింటి సర్వే చేయాలని సూచించారు. కొత్తగా నమోదు చేసుకునే ఓటర్లు వారికి సంబంధించిన ధ్రువపత్రాలను బీఎల్‌వోలకు ఇవ్వాలని కోరారు. ఓటర్ల జబితాలో మార్పులు, చేర్పులను సమర్ధవంతంగా పూర్తి చేయాలన్నారు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితా సవరణ గురించి ఎంపీడీవో లకావత్ రాజు వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో శాస్త్రీ, ఆర్ఐ లక్ష్మణ్, వైద్యాధికారి స్రవంతి పాల్గొన్నారు.



జడ్పీ సీఈవోగా దీక్షారైనా

బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 22: ఖమ్మంజిల్లా పరిషత్ సీఈవోగా దీక్షారైనా బాధ్యతలు స్వీకరించారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన దీక్షారైనా ప్రస్తుతం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ సెర్ప్‌ఐటీ విభాగంలో ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య భార్య అయిన దీక్షారైనా జమ్ముకశ్మీర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి గ్రూప్1 ఆఫీసర్‌గా 2020బ్యాచ్‌కు ఎంపికయ్యారు. స్వాప్ విభాగంలో ఆమెను ఖమ్మం కేటాయించారు. ఈ నేపథ్యంలో గురువారం ఆమె జిల్లాపరిషత్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ పర్యవేక్షకురాలు ఎ.రాజ్యలక్ష్మి, రమణశేఖర్, రమణ, రామకృష్ణారెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

27న 'గురుకులం'లో స్పాట్ అడ్మిషన్లు

పెనుబల్లి, ఆగస్టు 22: కుప్పెనకుంట్లలో నిర్వహిస్తున్న సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల (సత్తుపల్లి)లో ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న సీట్లకుగానూ ఈనెల 27న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.దేవజ్యోతి తెలిపారు. బైపీసీలో 19, ఎంపీసీ 11సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేసేందుకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో విద్యార్థులు కళాశాలకు హాజరై సీట్లు పొందవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 8466929460లో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీలలో బదిలీలకు అవకాశం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 22: జిల్లాలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో 2024 ఆగస్టు 1 నాటికి రెండేళ్ల కాలపరిమితి పూర్తి చేసుకున్న తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న పలువురికి బదిలీలకు అవకాశం కల్పిస్తూ గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీచేశారు. కేజీబీవీలలో స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీ ఆర్‌టీలు, సీఆర్‌టీలు, ఏఎన్‌ఎంలు, పీఈటీలు ప్రస్తుతం ఉన్న కేజీబీవీ నుంచి ఇతర కేజీబీవీలకు బదిలీలను కోరే వారు అమ అభ్యర్థనలను ఆన్‌లైన్‌లో సమగ్రశిక్షా వెబ్‌సైట్‌లో 22, 23 తేదీలలో సమర్పించాలని తెలిపారు. అనంతరం ధ్రువపత్రాలను సంబంధిత స్పెషల్ ఆఫీసర్లకు పరిశీలన కొరకు సమర్పించాలని తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

బోనకల్, ఆగస్టు 22: మండలంలోని ఆళ్లపాడు, చిరునోముల, ముష్టికుంట్ల, జానకీపురం గ్రామాల్లో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వైద్య శిబిరాలను నిర్వహించారు. జ్వర బాదితులను గుర్తించి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రియాంక, సింధు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వైరా రిజర్వాయర్‌లో మత్స్యకారుడి గల్లంతు

వైరా, ఆగస్టు 22: వైరా రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. గురువారం తెల్లవారుజామున హనుమాన్ బజార్‌కు చెందిన ఈర్ల రాములు(48)అనే మత్స్యకారుడు తెప్పపై చేపల వేటకు వెళ్లాడు. ఆసమయంలో భారీ ఈదురుగాలులతో కుండపోత వర్షం కురుస్తుండగా తెప్పపైన అదుపుతప్పి రాములు రిజర్వాయర్‌లో పడిపోయాడు. సమీపంలో చేపల వేట చేస్తున్న తోటి మత్స్యకారుల కళ్లెదుటే ఇది జరిగినా రాములును రక్షించలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. భారీ ఈదురుగాలులకు తెప్పలపై అల్లాడిపోయారు. మరో ముగ్గురు మత్స్యకారులు తెప్పలపైనుంచి నీళ్లలో పడిపోయి ఆతర్వాత తేరుకొని తెప్పల ఆధారంగా బయటపడ్డారు. ఆతర్వాత రాములు కోసం చేపల సొసైటీ అధ్యక్షుడు షేక్ రహీం, తోటి మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. రాములుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

కరకగూడెం, ఆగస్టు 22: మండలంలోని మోతే గ్రామానికి చెందిన మంద సారయ్య(50) అనే వ్యక్తి మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని పురుగుల మందు తాగి గురువారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి భార్య వెంకటమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన భర్త మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడని అందుకు తాను నిరాకరించడంతో పురుగుల మందు తాగాడని తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

బేతుపల్లి రెవెన్యూలో భూముల్లో వివాదం


గిరిజనులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ కిరణ్

సత్తుపల్లి, ఆగస్టు22: బేతుపల్లి రెవెన్యూలో పరిధిలోని ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీలోని 125ఎకరాల భూములలో ఇరువర్గాల మధ్య గురువారం వివాదం నెలకొంది. గంగారం గట్టుబజార్, కొమరంభీం కాలనీకి చెందిన గిరిజనులు ఎవరికి వారు తమ భూములకు హక్కులు ఉన్నాయంటూ వాదించుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో కొమరంభీం కాలనీకి చెందిన గిరిజనులు భూముల్లోకి వెళ్లగా గంగారం గట్టుబజార్ కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఘర్షణ వాతావరణం నెలకొనగా సమాచారం అందుకున్న పట్టణ సీఐ టీ.కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా సహకార శాఖ అధికారులు వచ్చి హక్కులు, సొసైటీ సభ్యులు ఎవరని తేల్చి చెప్పేవరకు భూములలోకి ఎవరూ వెళ్లవద్దని నచ్చచెప్పడంతో వివాదం ప్రస్తుతం సద్దుమణిగింది.

ఫేక్ కాల్స్‌ను నమ్మొద్దు..

» మహిళలు సాయం కోసం 100కు డయల్ చేయాలి

» మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి

కరకగూడెం, ఆగస్టు 22: ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నవదంతులను నమ్మొద్దని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యో' తో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో రాత్రి సమయంలో ఒంటరిగా ఉండే మహిళలకు 1091, 7837018555 పోలీసుహెల్ప్ లైన్ నెంబర్లను సంప్రదిస్తే సహాయం పొందవచ్చని వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని. పోలీసు శాఖ నుంచి ఇలాంటి ప్రకటనలు ఏమీ జారీ చేయలేదని తెలిపారు. మణుగూరు డివిజన్ మహిళలు ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మహిళలు 100 మాత్రమే డయల్ చేసి తెలపాలన్నారు.

డ్వాక్రా మహిళల సొమ్ము స్వాహా..

» గ్రామదీపిక, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ధర్నా


సెర్ప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

జూలూరుపాడు, ఆగస్టు 22: మండలంలోని కరివారిగూడెం గ్రామంలో స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు సంబంధించిన సొమ్మును స్వాహ చేసిన గ్రామదీపిక, బ్యాంక్ మిత్ర గరిడి దుర్గారావు, అతడికి సహకరించిన సెర్ప్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గురువారం జూలూరుపాడులోని సెర్ప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాలలోని సభ్యులు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా తాము తీసుకున్న రుణాన్ని కట్టాలని నెలనెల గ్రామదీపిక అయిన దుర్గారావుకు డబ్బులను ఇచ్చినప్పటికి తమ సంఘాల ఖాతాలలో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నారని అన్నారు. కరివారిగూడెం గ్రామాల్లో 8 గ్రూపులకు సంబంధించిన రూ. 30లక్షలను స్వాహా చేశారని అతనిపై చర్యలు తీసుకొని తమకి న్యాయం చేయాలని వారు కోరారు. అతడికి సహకరించిన సెర్ప్ సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి

చింతకాని, ఆగస్టు 22: చెట్టుపై నుండి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లచ్చగూడెం గ్రామానికి చెందిన అమర్లపూడి ప్రభుదాస్ (41) తన ఇంటి వద్ద చెట్టు కొమ్మలు తొలగిస్తూ ఈ నెల 16న చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడ్డాడు.

దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు దవఖానాలో చేర్పించి అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తల్లి మార్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణమాఫీ నుంచి రైతులకు విముక్తి ఎక్కడ?

» బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, ఆగస్టు 22: ఎన్నికలకు రెండు నెలల ముందు పార్టీ మారిన ఆ ఇద్దరు నేతలు... నేడు మంత్రులుగా పదవులు అనుభవిస్తున్నారని, ఆ ఇద్దరు బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసి నాడు పథకాలను పొగిడారని, ఇప్పుడు వాళ్లే విమర్శిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతుధర్నా చేపట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకం చిత్తశుద్ధి లేనిదని, రుణమాఫీని అర్హులైన అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతమందికి రుణమాఫీ ఇవ్వాలో శాస్త్రీయంగా లెక్కలు లేకుండా చేశారని, రుణాలు తీసుకునే రైతులు వడ్డీ చెల్లిస్తేనే మాఫీ అవుతుందని చెబుతున్నారని అన్నారు. 'ఎన్నికలప్పుడు ప్రతి రైతుకు రుణమాఫీ అన్నారు... కానీ ఇప్పుడు సాంకేతిక కారణాలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు.. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ రైతుబంధు క్రమం తప్పకుండా చెల్లించింది... పదేళ్లపాటు కొనసాగిన ఆ ఖాతాల్లోనే రుణమాఫీ వేసేందుకు అడ్డేమి వచ్చింది..?' అని సండ్ర ప్రశ్నించారు.

ఇప్పటికీ రైతుబంధు ఊసేలేకపోగా రుణమాఫీ 30శాతానికి మించి ఇవ్వలేక రాష్ట్ర ప్రభుత్వం చతికిల పడిందన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ద్వారా సహాయంతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ గతేడాది డిసెంబర్ నెల తర్వాత జరిగిన పెళ్లిళ్లకు ఎందుకు చెక్కులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

రూ.75కోట్లతో గోదావరి జలాలు వచ్చాయా?

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి బీఆర్ఎస్ హయాంలో కాలువలు తవ్వామని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కేవలం రూ.75కోట్లతో లింక్ కెనాల్ తవ్వి తామే ప్రాజెక్టును పూర్తి చేసినట్లు చెప్పుకుంటుందన్నారు. అయినా ఇప్పుడు నీళ్లు ఆ కాలువల్లో ఎక్కడా కనిపించడం లేదని, మోటారు పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆరింటిల్లో పూర్తిగా ఏదీ అమలు చేయలేదని, నెలలు గడుస్తున్నా.. పేద ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చిన రాష్ట్రప్రభుత్వం నేడు ప్రజలను విస్మరిస్తున్నదని, వారి తరపున పోరాడేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలని కోరారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీ వలే తాము కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయం కోసం ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు.


ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, జడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు ఎస్‌కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావు, నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా శంకరరావు, కట్టా అజయ్, మోదుగు పుల్లారావు, పగుట్ల వెంకటేశ్వరరావు, కాల్నేని వెంకటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, నరుకుళ్ల శ్రీను, గుండ్ర రఘు, చాంద్‌పాషా, మల్లూరు అంకంరాజు, ఆయూబ్‌పాషా, మదీనాపాషా తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అందని 'మాఫీ'ఫలం

(5వ పేజీ తరువాయి)

గార్లొడ్డు సొసైటీలో 4,570మంది రైతులండగా 1,219మంది రైతులకు రుణమాఫీ జరిగింది. ఇప్పటి వరకు కేవలం 407మంది రైతులకు మాత్రమే కొత్త రుణాలు ఇచ్చారు. ఏన్కూరు ఎస్‌బీఐలో 709మంది రైతులుండగా 553మంది రైతులకు రుణమాఫీ జరిగింది. కానీ ఇప్పటివరకు 30మందికి మాత్రమే తిరిగి రుణాలు ఇచ్చారు.

కొణిజర్ల మండలం గోపవరం సొసైటీలో 5,792మంది రైతులుండగా 2వేల మందికి రూ.7కోట్ల వరకు రుణమాఫీ చేశారు. ఇప్పటి వరకు 300మందికి రూ.2కోట్ల రుణం ఇచ్చారు. మధిర సొసైటీలో 4,118మంది రైతులకు రూ.2.51కోట్ల రుణమాఫీ జరగ్గా ఇప్పటి వరకు 310మంది రైతులు రూ.1.80కోట్ల రుణం తీసుకున్నారు. ముదిగొండ సొసైటీలో 1,276మంది రైతులకు రూ.18కోట్ల రుణమాఫీ చేశారు.

ఇప్పటి వరకు 200మంది రైతులకు రూ.1.60కోట్లు తిరిగి రుణాలు ఇచ్చారు. ముదిగొండ ఎస్‌బీఐలో 160మంది రైతులకు రూ.1.60కోట్లు మాఫీ జరగ్గా ఇప్పటి వరకు 130మంది రైతులకు రూ.1.20కోట్లు రుణం అందించారు. సత్తుపల్లి ఎస్‌బీఐలో 2,974మంది రైతులుకు మూడువిడతల్లో 834మందికి రుణమాఫీ జరిగింది. ఇప్పటి వరకు 675మంది కొత్త రుణాలు తీసుకున్నారు.

జిల్లాలో సహకార బ్యాంకులతో పాటు వాణిజ్య బ్యాంకులు గ్రామీణ బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితికి బ్యాంకుల్లో సిబ్బంది కొరత ఒక కారణంగా ఉంది. కొత్త రుణాల కోసం రైతులంతా ఒకేసారి వస్తుండడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని బ్యాంకుల్లో కొత్త రుణాలు మాజూరు చేసే క్రమంలో కొందరు రైతులకు చెందిన వడ్డీ బకాయిలను కట్ చేస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా ప్రస్తుతం పెట్టుబడి సీజన్ కావడంతో బ్యాంకులు కొత్త రుణాల పంపిణీని వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

నిలబడిన నిర్లక్ష్యం..

» రోడ్డుపై లారీ పార్క్ చేయడంతో ప్రమాదాలు


రోడ్డుపై నిలిపిన లారీ

ఖమ్మంక్రైం, ఆగస్టు 22: రోడ్డుపై లారీ నిలపడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నగరంలోని సరితాక్లినిక్ సెంటర్ నుండి బస్సుడిపో రోడ్డుకు వెళ్లే రోడ్డులో సమీప ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అక్కడ రోడ్డుపై లారీని నిలిపి వెళుతున్నాడు. దీంతో ముందు నుంచి వచ్చే వారికి రోడ్డు కనపడక ఎదురుగా వచ్చే వాహనాలకు తగులుతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా ఓ ద్విచక్రవాహనదారుడు డిపోరోడ్డు నుంచి వస్తుండగా లారీ అడ్డుగా ఉండడంతో ముందు వస్తున్న వాహనం కనపడలేదు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనానికి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఎలాంటి గాయాలు కానప్పటికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా చిన్నచిన్నప్రమాదాలు జరుగుతున్నప్పటికి ఆలారీకి చెందిన వ్యక్తి మాత్రం అక్కడి నుండి లారీని తీయడంలేదు. వాహనదారులు ఈ లారీ ఎవరిదని ప్రశ్నిస్తున్నా అక్కడున్న వారు మాత్రం సమాచారం చెప్పడం లేదు .. సంబంధిత పోలీసు అధికారులు స్పందించి ఆలారీని అక్కడపెట్టకుండా చూడాలని మరోసారి ప్రమాదాలు జరగకుండా చేయాలంటూస్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



డయాలసిస్ సేవలను కిడ్నీ రోగులు సద్వినియోగం చేసుకోవాలి

● సూపరింటెండెంట్ డాక్టర్ రాధారుక్మిణి



అశ్వారావుపేట, ఆగస్టు 22: అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత డయాలసిస్ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాధారుక్మిణీ కోరారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడిన డయాలసిస్ సేవలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులు పట్టణాలకు వెళ్ళనవసరం లేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పేద మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండేల ప్రభుత్వం డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. 24గంటలు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పరిసరాల్లోని మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న దివ్యాంగ పిల్లల నిర్ధారణ పరీక్షలు

సుజాతనగర్, ఆగస్టు 22: దివ్యాంగ పిల్లలు అలిమ్కో క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సుజాతనగర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చిట్లూరి వీరభద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు ఏర్పాటు చేసిన అలిమ్కో క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంప్‌లో దివ్యాంగులకు వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్యాంపునకు వచ్చే వారు సదరం ఏడీఐడీ కార్డు, రేషన్ కార్డు, ఆదాయం సర్టిఫికేట్, రెండు పాస్‌పోర్ట్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సుజాతనగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలోని భవిత సెంటర్‌ను సంప్రదించాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● న్యాయాధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న న్యాయాధికారి

భద్రాచలం, ఆగస్టు 22: వయోవృద్ధులకు వివిధ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలోని ఆల్‌పెన్షనర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కోసం అమల్లో ఉన్న ది మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ చట్టం గురించి వివరించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి సేవలను వివరించారు. అనంతరం సీఐ సంజీవరావు మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులొచ్చినా పోలీసు స్టేషన్‌కు వచ్చి తెలపాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.చైతన్య, న్యాయవాదులు పేరాల వెంకటేశ్వర్లు, పామరాజు తిరుమలరావు, ఎంవి రమ పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

- మాజీ ఎమ్మెల్యేలు వనమా, మెచ్చా నాగేశ్వరరావు హరిప్రియ, రేగా కాంతారావు
- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన
- వినతిపత్రాల అందజేత



కొత్తగూడెంలో ధర్నా చేస్తున్న వనమా

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 22: రాష్ట్రంలో రైతులకు ఆంక్షలు లేని రుణ మాఫీ చేయాలని మాజీ మంత్రి వనమ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం బస్టాండ్ సెంటర్‌లో గల అమర వీరుల స్థూపం వద్ద అమలరుకు నివాళ్ళు అర్పించి మాట్లాడారు. మాజీ మంత్రి వనమ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ రుణ మాఫీ చేసింది పావలా శాతం ..రైతులను డొల్ల చేసింది వంద శాతం అంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకి అన్యాయం జరిగిన సహించేది లేదని .. రైతు పక్షపాతిగా ఎప్పుడూ కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, వైస్ చైర్మన్ దామోదర్, మున్సిపల్ కౌన్సిలర్లు బండారి రుక్మదర్, అంబుల వేణు, వేముల ప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు వనమా రామవేంద్రరావు, కిలారు నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి బాదావత్ శాంతి, భూక్యా సోనా, మడిగా సరస్వతి, బత్తుల వీరయ్య, కొట్టి వెంకటేశ్వర్లు, అన్వర్ పాషా, నవతన్, తదితరులు పాల్గొన్నారు.

అందరికి రుణమాఫీ వర్తించాలి..

ఇల్లెందు టౌన్, ఆగస్టు 21: అర్హులైన పేద రైతులకు రుణ మాఫీ వర్తింపచేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ డిమాండ్ చేశారు. రైతులందరికి రుణమాఫీ ఇవ్వాలని కోరుతూగురువారం ఇల్లెందు తహసిల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, గిన్నారపు రాజేష్, బావ్‌సింగ్, శివ, కౌన్సిలరర్లు పాల్గొన్నారు.

హామీలు నిలబెట్టుకోకపోతే తిరగబడే రోజులొస్తాయి

రుణమాఫీ ధర్నా సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చ

అశ్వారావుపేట, ఆగస్టు 22: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో పూర్తిగ విఫలమయ్యిందని, త్వరలోనే ప్రజలు తిరగబడే రోజులొస్తాయని మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు ఆరోపించారు. గురువారం పట్టణంలో నిబంధనలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ పిలుపుమేరకు ధర్నా చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి జుజ్జూరి వెంకన్నబాబు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, పణీం ద్ర, సత్యవరపు సంపూర్ణ, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, దుర్గయ్య, గుడవర్తి వెంకటేశ్వరరావు, చిప్పనపల్లి బజారయ్య, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు/ పినపాక/ కరకగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రూపాయల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ పినపాక నియోజకర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు ఆందోళనలు చేశారు. అన్ని మండలాల్లో ప్రదర్శనలు నిర్వహించి తహసీల్దార్‌లకు కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించారు. మణుగూరులో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం తక్షణమే ప్రతిరైతుకు రెండు లక్షల రుణ మాఫీ ని ఆంక్షలు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. అన్ని మండలాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

●జూలూరుపాడులో జరిగిన బీఆర్‌ఎస్ ఆందోళనలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, మాజీ జడ్పీటీసీ భూక్య కళావతి, సొసైటీ డైరెక్టర్లు భూక్య జవహర్ లాల్, లకావత్ హేమ్లా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చావా వెంకటరామరావు, జెఎన్‌టియుహెచ్ రాష్ట్ర అధ్యక్షులు మందా రంజిత్, నాయకులు బి.సేవా, బి. చిన్నా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●బూర్గంపాడులో మాజీ జడ్పీటీసీ భూపల్లి నసింహరావు, రమణారెడ్డి, జగదీష్, బాలాజీ, లక్ష్మీనారయణరెడ్డి, చైతన్య, పొడియం నరేందర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● భద్రాచలంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, నాయకులు రేపాక పూర్ణచంద్రరావు, కాపుల సూరిబాబు, బత్తుల నరసింహులు, అంబటి కృష్ణ, అయినాల రామకృష్ణ, ప్రదీప్, మాచర్ల రంజిత్, అనిల్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

●టేకులపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్, అధికార ప్రతినిధి బానోతు కిషన్, యూత్ అధ్యక్షుడు శివకృష్ణ, మాజీ ఎంపీటీసీ బాలకృష్ణ, మండల నాయకులు లాలునాయక్, కిరణ్‌కుమార్, మూడు బాలు, ప్రసాద్, చందర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

●అశ్వాపురంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్,నాయకులు కొల్లు మల్లారెడ్డి,మర్రి మల్లారెడ్డి,గోపిరెడ్డి, కందులకృష్ణార్జున్,జాలె రామకృష్ణారెడ్డి, సుధీర్,అశోక్,వెంకట్రామయ్య,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





అశ్వారావుపేటలో వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా, ఇల్లెందు ఆందోళనలో హరిప్రియ, మణుగూరులో ధర్నాలో పాల్గొన్న రేగా కాంతారావు

'గృహజ్యోతి' దరఖాస్తుకు మరో అవకాశం

పాల్వంచ రూరల్/ఇల్లెందుటౌన్, ఆగస్టు 22 : రాష్ట్ర ప్రభుత్వం 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వినియోగానికి (గృహజ్యోతి పథకం) అర్హులైన వారు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ డాకూనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రజాపథంలో దరఖాస్తు చేస్తున్న వారు ఈ పథకం రాని వారు ఆన్‌లైన్‌లో సవరణ చేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తుదారులు రేషన్‌కార్డు, కరెంట్ బిలు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు స్లిప్పు జిరాక్స్‌కాపీలు తీసుకుని జతచేసి ఇవ్వాలని తెలిపారు.

ఇల్లెందు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులో భాగంగా గృహజ్యోతి పథకానికి అర్హత వారి వారు కరెంట్ మీటరు నెంబరు ఎంటర్ చేసుకునేందుకు అవకాశం ఉందని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాయలంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని వెల్లడించారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజారావుపేట అటవీ ప్రాంతంలో జిల్లా స్క్వాడ్ బృందం తనిఖీ

జూలూరుపాడు, ఆగస్టు 22: జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని రాజారావుపేట అటవీ ప్రాంతాన్ని గురువారం జిల్లా అటవీ శాఖ స్క్వాడ్ బృందం ఆకస్మీకంగా సందర్శించింది. గత కొన్ని రోజుల క్రితం రాజారావుపేట గ్రామానికి చెందిన కొందరు అటవీ ప్రాంతంలో చెట్లను నరికారు, దీంతో అదే గ్రామానికి చెందిన కొందరు స్క్వాడ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ జిల్లా స్క్వాడ్ సెక్షన్ అధికారులు క్రాంతి, లక్ష్మినారాయణతోపాటు సిబ్బంది అటవీ ప్రాంతాన్ని సందర్శించి నరికిన చెట్లను పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ బీట్ ఆఫీసర్ రాఘవ, రాంబాబు, సెక్షన్ అధికారి సలీం, బీట్ ఆఫీసర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

గోదావరి కరకట్టకు మరమ్మతులు

దుమ్ముగూడెం ఆగస్టు 22: దుమ్ముగూడెం గోదావరి కరకట్ట మరమ్మతులను ఇరిగేషన్ శాఖ అధికారులు గురువారం ప్రారంభించారు. హెడ్‌లాకుల నుంచి శ్మశానవాటిక వరకు కరకట్టకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలు తొలగించడంతోపాటు, చిన్నపాటి గుంతలను పూడ్చే పని ప్రారంభించారు. డీఈ మధుసూధనరావు, ఏఈ రాజ్‌సుహాస్, సిబ్బంది మస్తాన్‌వలీ ఉన్నారు. కాగా మరమ్మతుల విషయమై స్వయంగా ఎమ్మెల్యే చెప్పినా ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల కాంగ్రెస్ నాయకులు ఈనెల 21న ఆరోపించిన విషయం తెలిసిందే.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

లక్ష్మిదేవిపల్లి, ఆగస్టు 22 : మెగాస్టార్, పద్మభూషణ్ చిరంజీవి 69 జన్మదిన వేడుకలను గురువారం అభ్యుదయ కళా సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహలత- వృద్దుల, అనాధ ఆశ్రమంలో అన్నదానం చేశారు. అభ్యుదయ కళా సేవాసమితి మద్దెల శివకుమార్, గౌరవ అధ్యక్షుడు మెడికేర్ డయగ్నస్టిక్ అధినేత డాక్టర్ ప్రవీణ్, చిరంజీవి సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి బి. బిల్లన్‌బాబు, చిత్రపురి సొసైటీ కార్యదర్శి, సినీ నటులుసితాండూరు ధనరాజ్, నటుడు, దర్శకులు గౌతమి నర్మదా, చిత్రాల ఫేమ్ శ్రీ సుభాకర్, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు సేవా తత్పరురాలు ప్రముఖ కళాకారుని మునీల, సంఘ స్టేట్ ఆర్గనైజర్స్ ఆశ్రమ పర్యవేక్షులు కొమరయ్య సాయి పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

పాల్వంచ టౌన్, ఆగస్టు 22: పట్టణ పరిధిలో శుక్ర, శనివారాలు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ డాకూనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కరకవాగు వద్ద ఫిల్టర్‌బెడ్ క్లినింగ్ పనుల నిమిత్తం రెండు రోజులు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి: ఆర్టీసీ డీఎం

కరకగూడెం, ఆగస్టు 22: మణుగూరు డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యాంకుమార్ ప్రజలను కోరారు. గురువారం కరకగూడెంలో ఆర్టీసీ కార్గో సేవలను ప్రారంభించి మాట్లాడారు. సేల్ టీమ్ లీడర్ హరివర్మ, ఆపరేషన్ టీమ్ లీడర్ ఎస్‌కెఎం పాషా, కరకగూడెం లాజిస్టిక్స్ ఏజెంట్ అత్తె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే దేశానికి ప్రాతినిధ్యం: డీఎస్పీ

చుంచుపల్లి, ఆగస్టు 22: క్రీడలతోనే దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ గురువారం అన్నారు. ఇటీవలే భువనగిరిలో ముగిసిన రాష్ట్రం నాల్గొవ జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ, టైక్వాండో క్రీడా పోటీల్లో జిల్లా క్రీడా కారులు ప్రతిభ చూపి ఆరు పతకాలు సాధించారన్నారు. క్రీడలు మానసికంగా ఉల్లాసంగా నిత్య ఆరోగ్యంగా ఉండడానికి తోడ్పడుతాయన్నారు. స్వర్ణ, వెండి పతకాలు సాధించిన నిట్ట ప్రణయ్ కుమార్, అవినాష్, జయదీప్, చరణ్, డానియల్, గౌతమ్‌లను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఇనిగల మొగిలి, భద్రాద్రి జిల్లా టైక్వాండో అధ్యక్షుడు నిట్ట ప్రసాద్, రేజిలింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ పి.కాశి హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుండాల, ఆగస్టు 22: మండల కేంద్రంలో 27 అడుగులతో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ముందుగా విగ్రహ నిర్మాణ దాత తిరుక్కోవళ్లూరి వెంకటేశ్వర్లు- హరిప్రియ దంపతులు పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ తీర్థం రామక్రిష్ణ శర్మ, రామాలయ అర్చకులు సనత్ కుమార స్వామి ఆధ్వర్యంలో ఏకాహ్నిక దీక్షతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8గంటల 35ని.లకు యంత్ర ప్రతిష్ఠ, అభయ ఆంజనేయస్వామి దేవత ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మండల కేంద్రం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టు యోధుడు షోయాబుల్లాఖాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అగస్టు 22: జర్నలిస్టు యోధుడు షోయాబుల్లాఖాన్‌కు కొత్తగూడెం పాత్రికేయులు నివాళులర్పించారు. గురువారం షోయాబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి అయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డగా తన ప్రాణాలను లెక్కచేయకుండా కలంతో రజాకార్ల అరాచకాలను వెలుగులోకి తెచ్చిన గొప్ప వ్యక్తి షోయాబుల్లాఖాన్ అని అన్నారు. షోయాబుల్లాఖాన్ పోరాట పటిమ నేటితరం జర్నలిస్టులకు స్ఫూర్తిధాయకమన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు వట్టికొండ రవి, సురేష్, జంపన్న, అన్వర్, వినోద్, సతీష్, నరేష్, బాబన్న, కనకరావు, సత్యనారాయణ, హనుమంతు, అఫ్జల్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పాల్వంచ టౌన్, ఆగస్టు 22: పాముకాటుతో చికిత్స పొందుతున్న వ్యక్తికి పాల్వంచ చలువాది ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 13,500 ఆర్థిక సహాయాన్ని గురువారం కుటుంబసభ్యులకు అందజేశారు. పాల్వంచ మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి అమృతుబాబు గత ఆదివారం పాముకాటుకు గురైయ్యాడు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వైద్య ఖర్చుల కోసం చలువాది ట్రస్టు ఆర్థికసాయం అందజేసింది. అండగా ఉంటామని, చలువాది ట్రస్టు అధ్యక్షుడు చలువా ప్రకాష్ వారి కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాంజలి నాయుడు, నాంపల్లి వేణు, కొత్తగుళ్ల కుటుంబరావు,నాగేశ్వరరావు, దారా శ్రీనివాసరావు, ఉప్పుశెట్టి రాహుల్, యాదగిరి, సంపత్‌కుమార్,నాయుడు, చలువాది రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైల్లో టీబీ, హెచ్‌ఐవీ వ్యాధులపై అవగాహన

భద్రాచలం, ఆగస్టు 22: భద్రాచలంలోని ప్రత్యేక సబ్‌జైలు ప్రాంగణంలో గురువారం ఖైదీలకు హెచ్‌ఐవీ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాతి ఎన్‌జీవో కోఆర్డినేటరు డాక్టర్ దేవేందర్, డీపీపీఎం సోమయ్యలు హెచ్‌ఐవీ, క్షయవ్యాధి లక్షణాలు, చికిత్స విధానాలను వివరించారు. కార్యక్రమంలో భద్రాచలం సెక్యూర్ ఎన్‌జీవో సిబ్బంది ప్రసాద్, ఎస్టీఎస్, ఎన్‌టీఈపీ కీ స్టాఫ్ పాల్గొన్నారు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

జూలూరుపాడు, ఆగస్టు 22: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని లేకుంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు పదోన్నతలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిన పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని వెంటనే డీఎస్సీని నిర్వహించి నియామకాలను చేపట్టాలన్నారు. 317 జీవో ద్వారా వచ్చిన ఉపాధ్యాయులను వెంటనే వారి సొంత జిల్లాలకు పంపించాలని, భద్రాద్రి జిల్లాలో ఎక్కువ భాగం ఏజెన్సీలో ఉన్నందున ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వ ధరకే ఇళ్ల స్థలాలను కేటాయించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో నిలిచిపోయిన మన ఊరు-మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కళావతి, ఉపేందర్, నాయకులు ఎస్‌కె మీరా, లక్ష్మీ నర్సయ్య, పుల్లారావు, ఉమ, రామనాధం, ప్రసాద్, శకుంతుల తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం: పొదెం వీరయ్య


మాట్లాడుతున్న పొదెం వీరయ్య

పినపాక /మణుగూరు/అశ్వాపురం ఆగస్టు 22 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టి పార్టీకి అండగా నిలబడింది పార్టీ కార్యకర్తలే అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , రాష్ట్ర అటవీ శాఖ కార్పోరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. గురువారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పొదెంకు పినపాక , మణుగూరు మండలాల్లో ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు, శాలువలతో సన్మానాలు చేశారు. దుగినే పల్లి నుంచి ఏడూళ్లబయ్యారం క్రాస్ రోడ్ వరకు ద్విచక్రవాహన ప్రదర్శన బాణా సంచాలతో ఘన స్వాగతం పలికారు. పినపాక మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించగా పొదెం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో పినపాక మండల నాయకులు గొడిశాల రామనాధం, బషీరుద్దీన్, గట్ల శ్రీనివాస రెడ్డి, సాంభశివరెడ్డి, నవీన్, కాంతరావు పాల్గొన్నారు.

మణుగూరులో: మణుగూరు పర్యటనలో ఆదివాసీ సంఘాల నాయకులు పొదెంకు టిడిపి సెంటర్‌లో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా పొదెం వీరయ్య అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు కార్యక్రమంలో నాయకులు చందా సంతోష్‌కుమార్, నవీన్, చందా సంతోష్, రఘురామ్ ఆలెంటకోటి, వర్సాశ్రీనువాస్, కురం రవి, రహీమ్, పొలమూరిరాజు, కాటిబోయిన నాగేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: తెలంగాణ అటవీఅభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించే కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్యను మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం అశ్వాపురంలో ఘనంగా సన్మానించారు. స్థానిక పార్టీకార్యాలయానికి వచ్చిన వీరయ్యను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, తూము రాఘవులు,ఆవులరవి, మచ్చా నర్సింహరావు,రాము,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్‌బాక్స్ వితరణ

పినపాక, ఆగస్టు 22: మండలంలోని దుగినేపల్లి గ్రామ పంచాయతీ కి చెందిన సుంకరి రమణయ్య తన భార్య సావిత్రమ్మజ్ఞాపకార్థం రూ 85 వేల విలువ గల ఫ్రీజర్ బాక్స్ గ్రామ పంచాయతీకి వితరణగా గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజలు కొందరు తమ ఆత్మీయుల అకాల మరణాల నేపథ్యంలో మృత దేహాలను కొంత సమయం వరకు జాగ్రత్తగా బధ్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో తన భార్య జ్ఞాపకార్థం ఈ శీతల శవ పేటికను వితరణగా అందించడం జరిగిందన్నారు. నిరుపేదలకు ఈ శీతలశవపేటిక ఉపయోగపడుతోందని అన్నారు. దూరపు బంధువులు తమ వారి చివరి చూపులు చూసుకునేందుకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శవపేటికను పంచాయతీ కార్యదర్శి సంధ్యకు అందించారు.

ఆటోడ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

- ఎస్పీ రోహిత్‌రాజ్, పాల్వంచ, ఇల్లెందు డీఎస్పీలు సతీష్‌కుమార్, చంద్రబాను
- ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలని హెచ్చరిక



పాల్వంచలో మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

కొత్తగూడెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి)/ పాల్వంచ/ ఇల్లెందుటౌన్: జిల్లాలోని ఆటో డ్రైవర్లందరు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి సామాన్య ప్రజానానికానికి ఇబ్బందులు కలగకుండ సహకరించాలని ఎస్పీ రోహిత్ రాజ్ ఓ ప్రకటనను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లందరికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశింలను జారీచేశారు. పాల్వంచ, భద్రాచలం, ఇల్లెందు పట్టణాల్లోని ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి పోలీసు అధికారులు పలు సూచనలుచేశారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణీకు పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలనిసూచించారు. ఆటో డ్రైవర్లందరుక్రమ శిక్షణ కలిగి ఉండి తమ వాహానానికి సంబంధించిన అన్ని రకాల ఎల్లప్పుడు తమతోనే ఉంచుకుని పోలీఉ వారి జరిమానాలకు గురికాకుండ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సామాచారం అందించి తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. డ్రైవర్ సీటు వెనుకు భాగంలో డ్రైవర్ పేరు, పోన్ నెంబర్‌ను ప్రయాణీకులకు కనిపించే విధంగా ఖచ్చితంగా ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

పాల్వంచ, : ఆటోడ్రైవర్లు మహిళల పట్ల గౌరవ భావంతో మెలగాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా సధస్సు ఏర్పాటు చేశారు. మైనర్లకు, లైసెన్స్ లేని వారికి ఆటోలను కిరాయికి ఇవవ్వవద్దని ఆటో యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, పాల్వంచ టౌన్ ఎస్‌ఐ సుమన్, అడిషనల్ ఎస్‌ఐ రాఘవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

ఇల్లెందు టౌన్ వాహనదారులు, ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు డీఎస్పీ ఎన్. చంద్రభాను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని బస్టాండ్ సెంటరులో ఆటో డ్రైవర్ల ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహణదారుడు, ఆటో డ్రైవరు నిబంధనలపై అవగాహణ పెంపొందించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారయణతోపాటు పలువు పోలీసు సిబ్బంది, వాహనదారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి: జడ్పీ సీఈవో


సుజాతనగర్‌లో మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో, డీఆర్‌డీవో

సుజాతనగర్/బూర్గంపాడు/దుమ్ముగూడెం, ఆగస్టు 22 : 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం తమ బాధ్యతగా భావించాలని జడ్పీ సీఈఓ చంద్రశేఖర రావు, డీఆర్డీఓ విద్యాచందన అన్నారు. గురువారం 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాఘవాపురం గ్రామ పంచాయతీలో మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ ఇంటిలో గాని పరిసరాలలో గానీ కనీసం అమ్మ పేరు మీద నాలుగు మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించే బాధ్యత కూడా వారే స్వయంగా చేసి అమ్మ పేరును సార్థకం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీనివాస్, ఈసీ హరినాధ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించేందుకు కృషి చేయాలని బూర్గంపాడు గ్రామపంచాయతీ ఈవో సమ్మయ్య అన్నారు. గురువారం బూర్గంపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా 'నాటుదాం ఒక చెట్టు-అమ్మ పేరు మీద' అనే నినాదంతో గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపరిండెంట్ రవీందర్‌బాబు, యుడిసి రఘు, భజన ప్రసాద్, దుద్దుకూరి రమేష్, శనగ కిషోర్, చిర్రా నాని, ప్రతాప్, పంచాయతీ సిబ్బంది అనిల్, దిలీప్, వెంకన్న, రాజు పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయంలో మొక్క నాటుతున్న దృశ్యం

జూనియర్ కళాశాలలో వనమహోత్సవం

దుమ్ముగూడెం: వనమహోత్సవంలో భాగంగా దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మొక్కలను నాటారు. నాటిన ప్రతీ మొక్కనూ సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వరరాజు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మల్లెల శ్రీనివాసరావు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.